క్లుప్తంగా

గోవిందరాజుకు ఉత్తమ వ్యాపారవేత్త అవార్డు



నేషనల్ అవార్డు అందుకున్న పండు గోవిందరాజు

కె.గంగవరం: మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు ఉత్తమ వ్యాపారవేత్తగా అవార్డు అందుకున్నారు. శుక్రవారం సాయంత్రం అసోం రాష్ట్రంలోని గౌహతి వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కోసీడీసీఐ అనే నేషనల్ సంస్థ నుంచి పదో నేషనల్ అవార్డును సంస్థ జనరల్ డైరెక్టర్ హన్స్‌రాజ్ వర్మ, మేనేజింగ్ డైరెక్టర్ ఐఏఎస్ యువరాజు చేతుల మీదుగా ఉత్తమ వ్యాపారవేత్త నేషనల్ అవార్డును అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా రుణాలు పొంది సమర్థవంతంగా చిన్న పరిశ్రమలను విజయవంతంగా నడుపుతూ తిరిగి రుణాలు సక్రమంగా చెల్లించే వారికి ఈ అవార్డు వస్తుందని గతంలో 2018లో కూడా అవార్డు వచ్చిందన్నారు. పండు గోవిందరాజుకు అవార్డు రావడంపై పలువురు ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అభినందనలు తెలిపారు.

క్రీస్తు బోధనలు సన్మార్గానికి మార్గదర్శకం

ఎమ్మెల్యే వేగుళ్ల


కపిలేశ్వరపురంలో క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం: ఏసు క్రీస్తు బోధనలు మానవ జీవన గమనానికి సన్మార్గదర్శకమని స్థానికంగా నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవ ప్రబోధకులు అన్నారు. స్థానిక క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం కపిలేశ్వరపురం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ క్రిస్మస్ అందరికీ ఆనందదాయకమన్నారు. ఫెలోషిప్ అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు జి.రూబేన్, కె.ఏసురత్నం ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. క్రైస్తవ ప్రబోధకులు డేనియల్ పాల్ సువార్త సందేశాన్నిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.చిన్నారావు, సర్పంచ్ శాకా శ్రీనివాస్, ఫెలోషిప్ నాయకులు ఎం.డేవిడ్‌రాజ్, కె.కిరణ్‌పాల్, పి.నానిబాబు, కె.బర్నబాస్, కె.ఇమ్మానుయేల్‌రాజ్, పి.ప్రసాద్, వై.ఏషయ్య, కె.ఏసురత్నం, టి.మోషే, బి.ఐజిక్ క్రిస్టోఫర్, జి.ధన్యకుమార్, ఎం.మనేష్షే, ఎం.సత్యకుమార్, బీజేరాజు, జి.జోసెఫ్ జాన్‌రాజా పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్రహారతి, కుంభహారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామి పటిక బెల్లం తులాభారంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ–ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.88,760, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.23,376తో మొత్తం రూ.1,12,136 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు.

సహదేవ్‌కు జాతీయ సేవారత్న అవార్డు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెంకు చెందిన హ్యూమానిటీ హార్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తాడి సహదేవ్‌కు శనివారం జాతీయ స్థాయి సేవారత్న అవార్డు దక్కింది. ఈ మేరకు విజయవాడలో నిర్వహించిన పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ సదస్సులో ప్రముఖుల చేతుల మీదుగా పై అవార్డు సహదేవ్ తీసుకున్నారు. కాగా తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ సదరు అసోసియేషన్ సేవారత్న అవార్డుతో సత్కరించినట్టు సహదేవ్ మీడియాకు తెలిపారు.


రాయవరంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు


పసలపూడిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


అంగరలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


ఆలయం వద్ద తీర్థంలో భక్తులు


మండపేటలో సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

వైభవోపేతం.. సుబ్బారాయుడి షష్ఠి మహోత్సవం

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, వల్లూరు, కాలేరు, కపిలేశ్వరపురం గ్రామాల్లో శనివారం షష్ఠి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున భక్తులు పుణ్య స్నానమాచరించి స్వామి దర్శనానికి ఆలయాలకు తరలివెళ్లారు. అంగరలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున భక్తులు బారులు తీరారు. పూలు, పడగలను స్వామికి సమర్పించారు. ఆలయ అర్చకులు స్వామిని విశేషంగా అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాలకు చెందిన ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. అంగర పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కపిలేశ్వరపురం గోదావరి గట్టున ఉన్న స్వామి ఆలయానికి గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వల్లూరు, కాలేరు శివాలయాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు చేశారు. నేలటూరు, అంగర, నల్లూరు గ్రామాల్లోని శ్రీబసవేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని ఆలయాలు వద్ద నిర్వహించిన తీర్థంలో చిన్నారులు, భక్తులు సందడి చేశారు.

సంగమేశ్వరంలో పోటెత్తిన భక్తులు

మండపేట: శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి వేడుకలు మండపేట, మండలంలోని ఏడిద సంగమేశ్వరంలోను శనివారం వైభవోపేతంగా జరిగాయి. తెల్లవారు జామునంచి పలు ఆలయాలు కిక్కిరిసాయి.

పట్టణంలోని రథం ఆలయం, టౌన్‌హాలు వద్ద శ్రీకామాక్షీ ఏకామ్రేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఏడిద సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద తీర్థ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు తమతమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి శోభారాణి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు ఏర్పాటు చేసి సజావుగా స్వామివారి దర్శనానికి అవకాశం కల్పించారు. రూరల్ సీఐ దొరరాజు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. స్థానిక రథం ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని కరుణించి కాపాడాలని వేడుకున్నారు.


వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద దర్శనానికి బారులు తీరిన భక్తులు

వాడవాడలా..

రాయవరం: మండలంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచే స్వామివారిని దర్శించుకున్నారు. సోమేశ్వరంలోని బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయాలతో పాటు రాయవరం పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయం, చెల్లూరులోని అగస్త్యేశ్వరస్వామి, వెదురుపాక, లొల్లలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వెదురుపాక, పసలపూడి, మాచవరం తదితర గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామున ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం వరకు కొనసాగింది. పలు ఆలయాల వద్ద షష్ఠి తీర్థాలు నిర్వహించారు. సోమేశ్వరం శివాలయం, రాయవరం రాజేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, విలపర్తి ఫణిధర్‌శర్మ, శశిధర్‌శర్మల ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో ఆయా గ్రామాలలో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. పసలపూడిలో జరిగిన షష్ఠి ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ నాగరామకృష్ణారెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి, చైతన్య రాజబాబు, డాక్టర్ గిరిబాల, పడాల అబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో..

రామచంద్రపురం రూరల్: మండలంలో సుబ్రహ్మణ్య షష్ఠిని ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో నెలకొన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. పూలు, పడగలు సమర్పించారు. సాయంత్రం సర్ప వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం, కల్యాణం కనులపండువగా నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్ఠికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు భోజన, వసతి సౌకర్యాలను కల్పించారు.

హసన్‌బాదలో..

గ్రామంలో వేంచేసిన వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలు ఆలయ ధర్మకర్త సామంచి సత్యనారాయణమూర్తి, ఈఓ ఎంవీవీ సత్యనారాయణల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: పట్టణంలోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు తెల్లవారుజామున 4 గంటల నుంచే బారులు తీరారు. రెండు క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించుకున్నారు. రద్దీ మధ్యాహ్నం వరకు కొనసాగింది.

కె.గంగవరంలో..

కె.గంగవరం: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలను మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకునేందుకు ఆలయాల వద్ద బారులు తీరారు. అముజూరులోని శివాలయం వద్ద కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద అర్చకులు వెలవలపల్లి అరుణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పామర్రు, తామరపల్లిలో షష్ఠి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో షష్ఠిని భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు.

కాజులూరులో..

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ఆలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. షష్ఠి మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. ఆయా గ్రామాల్లోని వంశపారంపర్య ధర్మకర్తలు, నిర్వాహక కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం తగిన వసతి ఏర్పాట్లు చేశారు.


గొల్లపాలెం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు


పామర్రులో షష్ఠి తీర్థంలో వస్తువులు కొనుగోలు చేస్తున్న భక్తులు


ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు

గ్రామాల్లో మొదలైన క్రిస్మస్ సందడి

- వేడుకలకు ముస్తాబవుతున్న ఇళ్లు, చర్చిలు
- ఆకట్టుకుంటున్న అలంకరణలు

రాయవరం: సత్యం, శాంతి, త్యాగం, కరుణ, దయ, ప్రేమ, నిరీక్షణ సందేశంతో ఏసుక్రీస్తు ఈ లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. లోక రక్షకుడిగా కీర్తించే ఏసు జననం లోకానికి పర్వదినం. శాంతి, త్యాగానికి ప్రతీకగా నిలుస్తున్న క్రిస్మస్ పండుగ నిర్వహణకు క్లస్టర్ పరిధిలోని క్రైస్తవులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. డిసెంబరు మాసం ప్రారంభం నుంచే క్రైస్తవులు ఇళ్ల వద్ద, చర్చిలను ముస్తాబు చేసి, స్టార్‌లను అలంకరించారు. చర్చిల్లో భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండుగ స్వాగత ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 25న క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్లస్టర్ పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలోని 120 గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది.

ప్రారంభమైన క్రిస్మస్ వేడుకలు

డిసెంబరు మొదటి వారం నుంచే క్రిస్మస్ వేడుకలు క్లస్టర్ పరిధిలో ప్రారంభమయ్యాయి. ఇప్పటికే పలు చోట్ల యూత్ క్రిస్మస్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెలంతా క్రిస్మస్ వేడుకల్లో భాగంగా నాటికలు, సెలబ్రిటీల సాక్ష్యాలు, క్యాండిల్ సర్వీస్ వంటి కార్యక్రమాలు, క్రీస్తు పుట్టికను వివరిస్తూ పశువుల పాకలను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద క్రిస్మస్ స్టార్, క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ తాత, క్రిస్మస్ గంటలు, కొవ్వొత్తుల వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేస్తున్నారు. అప్పుడే చర్చిల్లో కేక్‌లను కట్ చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను జరుపుకొంటున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో క్రీస్తు జన్మ వత్తాంతాన్ని తెలిపే నాటికలు, చిన్నారుల నత్య ప్రదర్శనలు పలువురిని అలరిస్తున్నాయి.


విద్యుత్ దీపాలంకరణ వెలుగుల్లో చర్చి

సుందరంగా ముస్తాబు

క్రైస్తవులు చర్చలకు రంగులు వేసి, క్రిస్మస్ ట్రీలు, వెలుగులు విరజిమ్మే నక్షత్రాలతో, రంగురంగుల విద్యుద్దీపాలతో ఇళ్లను, చర్చిలను అలంకరిస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో క్రిస్మస్ నక్షత్రాలను ఏర్పాటు చేశారు.

ఈ నెల అంతా ప్రత్యేకం


క్రిస్మస్ పర్వదినం క్రైస్తవులకు ప్రత్యేకమైంది. ఇప్పటికే చర్చిల వద్ద క్రిస్మస్ పర్వదినం వేడుకలను ప్రారంభించాం. క్రైస్తవారాధకులు ఏసుక్రీస్తు జన్మదినాన్ని నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

– ఎం.ప్రభవ్ కుమార్, పాస్టర్, లొల్ల, రాయవరం మండలం

యూత్ క్రిస్మస్‌లు ప్రారంభం


క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రతి ఇంటి, చర్చిల వద్ద క్రిస్మస్ స్టార్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికే చర్చిల వద్ద విద్యుత్ దీపాలను అలంకరించడంతో చర్చిలు క్రిస్మస్ శోభను సంతరించుకుంటున్నాయి.

– వెంట్రు శామ్యూల్ కుమార్, పాస్టర్, కూర్మాపురం, రాయవరం మండలం

టీబీని అంతం చేయాలి


కె.జగన్నాథపురంలో రోగులకు కళ్లె పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అయినవిల్లి: టీబీ వ్యాధిని అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వీరవల్లిపాలెం వైద్యాధికారి పి.విజయ్ అన్నారు. శనివారం మండలంలోని కె.జగన్నాథపురం సచివాలయం వద్ద కళ్లె నమూనా సేకరణ క్యాంపును సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంగుమళ్ళ కాశీఅన్నపూర్ణ ప్రారంభించారు. వైద్యులు విజయ్ మాట్లాడుతూ రెండు వారాల పైబడి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, కళ్లెలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా కళ్లె పరీక్ష చేయించుకోవాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శీతాకాలంలో ఎడతెరిపి లేని దగ్గుతో జ్వరాలతో ప్రజలకు అస్వస్థతకు గురవుతున్నారని తద్వారా ఇటువంటి వ్యాధులు ఒకరి నుంచి ఒకరికి సోకుతున్నాయన్నారు. హెల్త్ సూపర్ వైజర్ రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్, హెల్త్ అసిస్టెంట్ ముద్రగెడ నరసింహారావు, ఎంఎల్‌హెచ్‌పీ షారోన్, ఏఎన్ఎం గంగాభవాని, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యతో మెరుగైన విజ్ఞానం


కపిలేశ్వరపురంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఎల్‌డీఓ


మాచర ఉన్నత పాఠశాలలో ప్రోగ్రస్, ఆరోగ్య కార్డులతో విద్యార్థులు


ఆత్మీయ సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు


గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో తాడు ఆట ఆడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు


వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో తల్లిదండ్రులకు ఘనంగా స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మండపేట: మండలంలోని ద్వారపూడి చేకూరి విశ్వనాథరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. రంగవల్లుల పోటీల్లో పాల్గొని ముచ్చటైన ముగ్గులు వేసేందుకు ఒకరికొకరు పోటీ పడ్డారు. తొలుత స్థలదాత విశ్వనాథరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు సవితాల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాకమిటీ చైర్మన ఏ జయరవీంద్రయాదవ్, వైస్ చైర్మన్ గారపాటి ఈశ్వరి, ఉపాధ్యాయులు గండి స్వామి ప్రసాద్, బండారు రాము తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన కానిస్టేబుల్ వంశీ విద్యార్థుల చేత డ్రగ్స్ నివారణ ప్రతిజ్ఞ చేయించారుల్ వంశీ విద్యార్థుల చేత డ్రగ్స్ నివారణ ప్రతిజ్ఞ చేయించారు.

కపిలేశ్వరపురంలో..

కపిలేశ్వరపురం: ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్న శాస్త్రీయ విద్యతో మెరుగైన విజ్ఞాన సముపార్జనకు బాట పడుతుందని డీఎల్‌డీఓ కామేశ్వరరావు అన్నారు. మండలంలోని 19 గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను నిర్వహించారు. ఎంఈఓ కె.తాతారావు, ఆయా పాఠశాలల ఎస్ఎంసీ కమిటీల చైర్మన్లు, సభ్యులు, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో సమావేశాలు నిర్వహించారు. పాఠశాల నిర్వహణ, విద్యా ప్రాధాన్యత, ప్రభుత్వ పథకాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థులకు పలు ప్రతిభా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు ఎంఐఎస్ టి.సురేష్, సీఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికికృషి

రామచంద్రపురం: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతామని రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల పిలుపునిచ్చారు. రామచంద్రపురం పట్టణంలోని రత్నంపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల హెచ్ఎం వి.సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచడానికి ప్రభుత్వం మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయ సమావేశానికి పిలుపునిచ్చిందన్నారు. సమావేశంలో పాఠశాల హెచ్ఎం సుబ్బారావు పాఠశాలల విద్యాప్రగతిని వివరించారు. సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు ఎం.శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి, ఏరియా ఆసుపత్రి వైద్యులు ద్వారంపూడి వీఎస్‌వీబీ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ పి.శ్రీరామచంద్రమూర్తి, పాఠశాల పూర్వ విద్యార్థులు, ఏపీ ట్రాన్స్‌కో ఏడీఈ కడలి నరేంద్ర తదితరులు మాట్లాడారు. తల్లిదండ్రులకు నిర్వహించిన టగ్ ఆఫ్ వార్, రంగోలి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకు ముందుగా చిన్నారుల ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎం.వీరవేణి, వైస్ చైర్మన్ సురేష్, సభ్యులు కె.దుర్గాప్రసాద్, మానస, దుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు శనివారం మెగా పేరెంట్స్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రాధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో పాఠశాలల పురోగతిపై చర్చించి పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు మహిళలకు రంగవల్లి, కోకో, పురుషులకు కబడ్డీ, తాడు ఆటలను నిర్వహించారు. విజేతలైన వారికి బహుమతులు అందజేశారు.

వెల్లలో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా శనివారం మెగా తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశాన్ని పండగ వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.వీరభద్రరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తరగతుల వారీగా విద్యార్థులు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు తల్లిదండ్రులకు అందించి విద్యార్థుల సమగ్ర ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సుంకర ఆదినారాయణ, వైస్ చైర్మన్ పందిరి శాంతికుమారి, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం శనివారం మండలంలో నిర్వహించారు. మండలంలోని 12 గ్రామాల పరిధిలోని 34 ప్రాథమిక, నాలుగు ప్రాథమికోన్నత, ఎనిమిది ఉన్నత పాఠశాలల్లో మెగా పేటీఎం సమావేశాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాలకు ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యులు, దాతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లులకు రంగవల్లుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారులు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణలు తదితరులు సమావేశాలను పర్యవేక్షించారు.